# రోడ్డు భద్రతతోనే సురక్షిత ప్రయాణం : సీఐ విజయ బాబు






**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 17(డీడీ9 వార్త) :** క్షణికావేశంలో చేసే పొరపాట్లు, ట్రాఫిక్ నిబంధనల పట్ల అజాగ్రత్త నిండు ప్రాణాలను బలితీసుకుంటున్నాయని బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. సాలూర మండల కేంద్రంలో బోధన్ రూరల్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ పేరుతో రోడ్డు భద్రతా అవగాహన సదస్సును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడివో శ్రీనివాస్, సీఐ విజయ్ బాబు, ఎస్సై మశ్చందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ క్షేమంగా ఇంటికి చేరుకోవాలనే లక్ష్యంతోనే పోలీస్ శాఖ ఈ అవగాహన కార్యక్రమాలు చేపడుతోందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం ప్రమాదకారని గుర్తు చేశారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో యువత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సురక్షిత ప్రయాణం అందరి బాధ్యత : సబ్ కలెక్టర్ వికాస్ మహా తో




**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 17(డీడీ9 వార్త) :** రహదారి నిబంధనలను తూచా తప్పకుండా పాటించినప్పుడే సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహా తో పేర్కొన్నారు. బోధన్ పట్టణంలో రోడ్డు భద్రత మరియు బాధ్యతాయుత డ్రైవింగ్‌ను ప్రోత్సహించే లక్ష్యంతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అరైవ్ అలైవ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మున్సిపల్ సిబ్బందిని, పట్టణ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం అనేది కేవలం జరిమానాల నుంచి తప్పించుకోవడానికి మాత్రమే కాదని, అది ప్రతి పౌరుడి ప్రాణ రక్షణకు కవచం లాంటిదని స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన డ్రైవింగ్, హెల్మెట్ మరియు సీటు బెల్టుల వినియోగం, అతివేగాన్ని నియంత్రించడం వంటి అంశాలపై ఆయన ప్రత్యేకంగా దృష్టి సారించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ సామూహిక బాధ్యతగా భావించినప్పుడే పౌరుల భద్రత మరియు సంక్షేమం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ వెంకట నారాయణ, తహసీల్దార్ విట్టల్ పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది స్థానిక పౌరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భీమ్గల్ మండల పాస్టర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక



**నిజామాబాద్ జిల్లా జనవరి 17(డీడీ9 వార్త) :** భీమ్గల్ మండల కేంద్రంలో భీమ్గల్ మండల పాస్టర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో నిర్వహించిన పాస్టర్ల సర్వసభ్య సమావేశంలో శాంతియుత వాతావరణంలో ఈ ఎన్నికల ప్రక్రియ ముగిసింది. మండలంలోని వివిధ గ్రామాల నుండి పాస్టర్లు పెద్ద సంఖ్యలో హాజరై నూతన బాధ్యులను ఎంపిక చేశారు. నూతన కార్యవర్గం వివరాలు: అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా పాస్టర్ డి. శామ్యూల్, అధ్యక్షుడిగా బోయిడి సుధాకర్, ఉపాధ్యక్షులుగా పాస్టర్ మోహన్ మరియు పాస్టర్ పాల్, ప్రధాన కార్యదర్శిగా పాస్టర్ ఫిలోమోన్, సహాయ కార్యదర్శిగా పాస్టర్ టైటాస్, కోశాధికారిగా పాస్టర్ నెల్సన్ ఎన్నికయ్యారు. అలాగే గౌరవ సలహాదారులుగా పాస్టర్ డేవిడ్, పాస్టర్ జీవరత్నంలను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. పాస్టర్ల సంక్షేమమే ధ్యేయం: ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బోయిడి సుధాకర్ మాట్లాడుతూ.. మండలంలోని పాస్టర్లందరినీ ఏకం చేసి, వారి సంక్షేమం కోసం అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఆధ్యాత్మిక విలువలను కాపాడుతూ, సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. క్రైస్తవ సమాజ సమస్యల పరిష్కారానికి, ఐక్యతకు పెద్దపీట వేస్తామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సభ్యులను సీనియర్ పాస్టర్లు మరియు సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని పలు సంఘాల పాస్టర్లు, క్రైస్తవ పెద్దలు పాల్గొన్నారు.

# అమర కానిస్టేబుల్ ప్రమోద్ స్మారక క్రికెట్ పోటీలు ప్రారంభం










**నిజామాబాద్ జిల్లా జనవరి 17(డీడీ9 వార్త) :** నిజామాబాద్ జిల్లా కేంద్రంలో విధి నిర్వహణలో ఉండగా దారుణ హత్యకు గురైన సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ స్మారకార్థం బాల్కొండలో ఏర్పాటు చేసిన టీ-10 క్రికెట్ పోటీలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. నిజామాబాద్ ఏసీపీ బసవయ్య ముఖ్య అతిథిగా హాజరై ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ బసవయ్య మాట్లాడుతూ, క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో మెలగాలని, శారీరక దృఢత్వానికి క్రికెట్ ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. అనంతరం ఎస్.ఐ శైలేందర్ మాట్లాడుతూ, ఈ పోటీలలో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ. 50,000, ద్వితీయ బహుమతిగా రూ. 30,000 నగదుతో పాటు ప్రతి మ్యాచ్‌లో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డులు ఉంటాయని వివరించారు. పోటీల ప్రారంభంలో ఏసీపీ బసవయ్య స్వయంగా బ్యాటింగ్ చేయగా, బాల్కొండ సర్పంచ్ గాండ్ల రాజేష్ బౌలింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గాండ్ల రాజేందర్, పంచాయతీ సభ్యులు పుల్లాయి నవీన్, పిట్ల దయాకర్, అడ్వాల నరేష్, తెడ్డు సందీప్, తిరునగరి నవీన్, కాంగ్రెస్ నాయకులు యూనస్ తదితరులు పాల్గొన్నారు. కానిస్టేబుళ్లకు రేవాల్వర్ ఇవ్వాలి: కానిస్టేబుల్ ప్రమోద్ స్మారకార్థం పోటీలు నిర్వహించడంపై నిజామాబాద్ జిల్లా మానవ హక్కుల కౌన్సిల్ సామాజిక సాంస్కృతిక అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్ బ్రహ్మ రౌతు నర్సింగ్ రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో ప్రతి పోలీస్ కానిస్టేబుల్‌కు ఆత్మరక్షణ కోసం 'రేవాల్వర్' ఇవ్వాలని రాష్ట్ర పోలీస్ ఉన్నత అధికారులను కోరారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో ఈ పద్ధతి అమల్లో ఉందని, దీనివల్ల విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడులు జరిగినప్పుడు నిందితులను ఎదుర్కోవడానికి అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. అలాగే, ప్రమోద్ కుటుంబానికి పోలీస్ శాఖ భారీ ఆర్థిక సాయంతో పాటు పూర్తి స్థాయి వేతనం ఇవ్వడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# సాలూర మండలంలో లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 17(డీడీ9 వార్త) :** ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కొండంత అండగా నిలుస్తుందని సాలూర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మందర్న రవి పేర్కొన్నారు. శుక్రవారం సాలూర మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు శాసనసభ్యులు, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆయా గ్రామాల లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ.. అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తమను ప్రభుత్వం సకాలంలో ఆదుకుందని హర్షం వ్యక్తం చేశారు. కష్టకాలంలో చేయూతనిచ్చిన ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డికి, నిరంతరం ప్రజల చెంతనే ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లే రమేష్, ఇల్తేపు శంకర్, ఖాజాపూర్ అశోక్, సాలూర గ్రామ సర్పంచ్ సోక్కం లావణ్య రవి, ఉప సర్పంచ్ సురేష్ శివ కాంత్, వీరేష్, ఛిద్రపు అనిల్, గంగాధర్ పాల్గొన్నారు.

# అంత్యక్రియలకు ఉచిత వాహనం విరాళం




**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 17(డీడీ9 వార్త) :** సమాజ సేవలో భాగంగా తన తండ్రి జ్ఞాపకార్థం ఎంఐఎం బోధన్ పట్టణ అధ్యక్షులు మీర్ ఇలియాస్ అలీ చేపట్టిన కార్యక్రమం పట్ల పట్టణ ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. బోధన్ పట్టణంలోని మైనారిటీల కోసం, అంత్యక్రియల నిర్వహణకు గాను ఆయన ఒక ఐచర్ వాహనాన్ని విరాళంగా అందజేశారు. తన తండ్రి స్వర్గీయ మీర్ లియాఖత్ అలీ జ్ఞాపకార్థం ఈ వాహనాన్ని అంకితం చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా మీర్ ఇలియాస్ అలీ మాట్లాడుతూ.. పట్టణంలోని మైనారిటీ కుటుంబాల్లో ఎవరైనా మృతి చెందితే, పార్థివ దేహాలను ఖననం చేసేందుకు శ్మశాన వాటిక లకు తరలించడం ఆర్థికంగా భారమవుతోందని, పలువురు తన దృష్టికి తెచ్చారని పేర్కొన్నారు. నిరుపేదలు ప్రైవేట్ వాహనాలను అద్దెకు తీసుకోవాలంటే పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ వాహనానికి డ్రైవర్‌తో పాటు 24 గంటల పాటు ఉచితంగా అందుబాటులో ఉంటుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కరోనా కష్టకాలం నుండి నిరంతరంగా సమాజ సేవలో పాల్గొంటున్న రహ్మత్ అలీని ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. మంచి ఆశయంతో చేపట్టిన ఈ కార్యక్రమం అందరికీ ఆదర్శమని పలువురు వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ ప్రధాన కార్యదర్శి అహ్మద్ బిన్ మోసిన్, జాయింట్ సెక్రటరీ హాజీ బిల్డర్, జిల్లా కార్యదర్శి ఎం.ఏ. సమీ, నాయకులు ఉమర్, అబ్దుల్ రషీద్, అయూబ్, అలీం రజా, అల్తాఫ్, సమీర్, నవీద్, సలాం చావూస్, రహ్మత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# రెంజల్‌లో భక్తిశ్రద్ధలతో బురక్ష ఖాద్రి ఉర్సు

**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 17(డీడీ9 వార్త) :** రెంజల్ మండల కేంద్రంలో హజరత్ సయ్యద్ బురక్ష ఖాద్రి 130వ ఉర్సు ఉత్సవాలను ముస్లిం సోదరులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి ఏటా నిర్వహించే ఈ వేడుకలు ఈసారి కూడా ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగాయి. ఉర్సు వేడుకల్లో భాగంగా మౌలానా సోఫీ నివాసం నుంచి గంధం ఊరేగింపును వైభవంగా ప్రారంభించారు. ఈ గంధాన్ని తలపై ఎత్తుకుని మతపరమైన కీర్తనల నడుమ గ్రామ ప్రధాన వీధుల గుండా ప్రదర్శించారు. ముస్లిం సోదరులు సంప్రదాయ దుస్తులు ధరించి పెద్ద సంఖ్యలో ఈ ఊరేగింపులో పాల్గొన్నారు. ప్రధాన రహదారి గుండా సాగిన ఈ ఊరేగింపు స్థానిక జమా మసీదుకు చేరుకోవడంతో దర్గాకు చేరుకున్న భక్తులు భక్తితో చాదర్లు, పూలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం దర్గా ప్రాంగణంలో సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు (దువా) నిర్వహించారు. లోక కల్యాణం కోసం, పాడిపంటలు సమృద్ధిగా పండాలని భక్తులు వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మత గురువులు మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిషేధిత చైనా మాంజా విక్రేతకు రిమాండ్

**నిజామాబాద్ జిల్లా జనవరి 17(డీడీ9 వార్త) :** నిజామాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ సమీపంలో చైనా మాంజా విక్రయిస్తున్న షాపు యజమానిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సయ్యద్ ముజాయిద్ గురువారం వెల్లడించారు. ఈ నెల 1వ తేదీన హెడ్ పోస్ట్ ఆఫీస్ సమీపంలోని సుల్తాన్ కైట్ షాపుపై పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాను విక్రయిస్తున్నట్లు గుర్తించి, పెద్ద మొత్తంలో నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. అయితే పోలీసుల దాడి సమయంలో షాపు యజమాని ఫహీమ్ అన్సారీ అక్కడి నుంచి పరారయ్యాడు. నిందితుడి కోసం గాలింపు చేపట్టిన పోలీసులు, గురువారం అతనిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం అతనికి 14 రోజుల రిమాండ్ విధించిందని ఎస్సై తెలిపారు. నిషేధిత చైనా మాంజా విక్రయించినా నిల్వ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. పక్షులకు, మనుషులకు ప్రాణాపాయంగా మారిన చైనా మాంజాను ఎవరూ వాడకూడదని ఆయన కోరారు.

## వేటగాళ్ల కర్కశత్వానికి మూగజీవి బలి

**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 17(డీడీ9 వార్త) :** అడవి పందుల వేట కోసం వేటగాళ్లు వేసిన మందుగుండు ఓ మూగజీవి ప్రాణాలను బలిగొంది. పశుగ్రాసంలో పేలుడు పదార్థాలను అమర్చి వేటగాళ్లు చేసిన ఘాతుకానికి ఓ రైతు కుటుంబానికి చేదోడుగా ఉన్న ఆవు నోరు ఛిద్రమై అక్కడికక్కడే మరణించింది. ఈ అమానుష ఘటన ఎడపల్లి మండలం జానకంపేట గ్రామ శివారులో చోటుచేసుకుంది. దూపల్లి గ్రామానికి చెందిన రైతు కారె సాయికుమార్ తన ఆవును మేత కోసం జానకంపేట శివారు ప్రాంతానికి తీసుకెళ్లారు. అదే ప్రాంతంలో అడవి పందులను వేటాడేందుకు గుర్తుతెలియని వ్యక్తులు పశువులకు ఇష్టమైన తవుడులో శక్తివంతమైన పేలుడు పదార్థాలను కలిపి పొలాల్లో వదిలిపెట్టారు. మేత మేస్తున్న క్రమంలో సాయికుమార్ ఆవు ఆ తవుడును తినగానే ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. ఈ ధాటికి ఆవు నోటి భాగం పూర్తిగా విచ్ఛిన్నమై, తీవ్ర రక్తస్రావంతో ఆ మూగజీవి అక్కడే కుప్పకూలి ప్రాణాలు విడిచింది. పండుగ వేళ తమ కుటుంబానికి జీవనాధారమైన ఆవు మృతి చెందడంతో బాధితుడు సాయికుమార్ కుటుంబం రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనతో గ్రామ శివారు ప్రాంతాల్లో రాకపోకలు సాగించే రైతులు, కూలీలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. వేటగాళ్ల ఆగడాలు మితిమీరిపోతున్నాయని, పోలీసులు తక్షణమే రంగంలోకి దిగి బాధ్యులను గుర్తించి కఠినంగా శిక్షించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి పేలుడు పదార్థాల వల్ల రేపు మనుషులకు కూడా ముప్పు పొంచి ఉందని, శివారు ప్రాంతాల్లో నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

## బీఎస్ఎఫ్ జవాన్ రాజుకు ఘన సన్మానం



**నిజామాబాద్ జిల్లా జనవరి 17(డీడీ9 వార్త) :** సరిహద్దు భద్రతా దళంలో జవాన్‌గా ఉద్యోగం సాధించిన కమ్మర్ పల్లి మండల కేంద్రానికి చెందిన చింతకుంట రాజును కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు రాజును శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... దేశ సేవ చేసే అవకాశం రావడం అదృష్టమని, దేశ రక్షణ కంటే మించిన గౌరవం మరొకటి లేదని కొనియాడారు. కష్టపడి చదివి, శారీరక దారుఢ్య పరీక్షల్లో రాణించి బీఎస్ఎఫ్‌కు ఎంపికైన రాజు గ్రామానికి గర్వకారణమని పేర్కొన్నారు. నేటి యువత రాజును స్ఫూర్తిగా తీసుకుని రక్షణ రంగంలో స్థిరపడాలని, దేశ భక్తిని చాటుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుంకేట రవి, సొంపేట బుచ్చన్న, తిప్పిరెడ్డి శ్రీనివాస్, కౌడ శైలేందర్, జగదీష్, ప్రసాద్, కిషన్ గౌడ్, చంద్రకాంత్ రెడ్డి మరియు ఇతర కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు. అందరూ రాజుకు శుభాకాంక్షలు తెలుపుతూ భవిష్యత్తులో అతను మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

## నిబంధనలు పాటిస్తేనే సురక్షిత ప్రయాణం: ఎస్సై అనిల్ రెడ్డి



**నిజామాబాద్ జిల్లా జనవరి 17(డీడీ9 వార్త) :** రహదారి నిబంధనలు పాటించడం ద్వారానే సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కమ్మర్ పల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం, చౌటుపల్లిలో గ్రామంలో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా సిబ్బందికి, ప్రజలకు రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ...మితిమీరిన వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ ప్రాణాల మీదకు తెస్తాయని హెచ్చరించారు. ప్రమాద రహిత సమాజం కోసం ప్రతి పౌరుడు బాధ్యతగా మెలగాలని, వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కలిగి ఉండటం వల్ల ఎన్నో విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజ శ్రీనివాస్, తహశీల్దార్ ప్రసాద్, చౌటుపల్లి సర్పంచ్ మహబూబ్, పంచాయతీ కార్యదర్శి శాంతి కుమార్ మరియు పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## జైతాపూర్ పాఠశాల అభివృద్ధికి విరాళం



**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 17(డీడీ9 వార్త) :** ఎడపల్లి మండలంలోని జైతాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి పనుల కోసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విరాళాన్ని అందజేశారు. గ్రామ సర్పంచ్ రాజు గౌడ్ సమక్షంలో పాఠశాలలోని తలుపులు, కిటికీల మరమ్మతులు మరియు ఇతర అభివృద్ధి పనుల నిమిత్తం రూ. 20 వేల ఆర్థిక సాయాన్ని పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. విద్యా సంస్థల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ప్రణీత్, వాసు, చైతన్య, సంతోష్ మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## జీప్ జాతాను జయప్రదం చేయండి



**నిజామాబాద్ జిల్లా జనవరి 17(డీడీ9 వార్త) :** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక, వ్యవసాయ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టనున్న జీప్ జాతాను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకటేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్మూర్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని ప్రభుత్వం సామాన్య ప్రజలను, రైతులను విస్మరించి కార్పొరేట్ శక్తులకు మేలు చేసేలా నిర్ణయాలు తీసుకుంటోందని ఆయన విమర్శించారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఈ నెల 17న ఆర్మూర్ మార్కెట్ యార్డ్ నుంచి జీప్ జాతా ప్రారంభమవుతుందని వెల్లడించారు. ఈ జాతా నియోజకవర్గంలోని ప్రధాన ప్రాంతాల మీదుగా సాగి 18న నిజామాబాద్ నగరంలో ముగుస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, కార్మికులు ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఆలూర్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా యల్లా సాయిరెడ్డి

**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 17(డీడీ9 వార్త) :** ఆలూర్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా యల్లా సాయిరెడ్డి శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో నిర్వహించిన సర్పంచుల సమావేశంలో అందరి ఆమోదంతో ఆయనను ఈ పదవికి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సాయిరెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి మండల సర్పంచుల ఫోరం బాధ్యతలను అప్పగించిన తోటి సర్పంచులకు, నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే పేద ప్రజల సంక్షేమం కోసం, గ్రామాల మౌలిక వసతుల కల్పన కోసం నిరంతరం అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మరియు నాయకులు కొర్ర కిషన్, విజయ్, గంగాధర్, మచర్ల చిన్నయ్య, దశరథ్, తోగర్ల భూషణ్, సుమన్ తదితరులు పాల్గొని సాయిరెడ్డికి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు.

## మున్సిపల్ రిజర్వేషన్ల కసరత్తు వేగవంతం : నేడు కలెక్టరేట్‌లో డ్రా

**నిజామాబాద్ జిల్లా జనవరి 17(డీడీ9 వార్త) :** జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియ వేగవంతమైంది. నిజామాబాద్ నగరపాలక సంస్థతో పాటు భీమ్‌గల్, ఆర్మూర్, బోధన్ మున్సిపాలిటీలకు సంబంధించి వార్డుల వారీగా మహిళా రిజర్వేషన్లను ఖరారు చేసేందుకు యంత్రాంగం రంగం సిద్ధం చేసింది. నేడు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో రిజర్వేషన్ల డ్రా నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ఒక్కో మున్సిపాలిటీకి నిర్ణీత సమయాలను అధికారులు కేటాయించారు. ముందుగా భీమ్‌గల్ మున్సిపాలిటీకి సంబంధించి ఉదయం 10 గంటలకు ప్రక్రియ ప్రారంభం కానుంది. అనంతరం 10.15 గంటలకు ఆర్మూర్, 10.30 గంటలకు బోధన్ మున్సిపాలిటీలకు డ్రా నిర్వహించనున్నారు. చివరగా ఉదయం 11 గంటలకు నిజామాబాద్ నగరపాలక సంస్థ డివిజన్ల మహిళా రిజర్వేషన్ల ప్రక్రియను చేపట్టనున్నారు. ఈ కీలక ప్రక్రియకు గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు నిర్ణీత సమయానికి హాజరుకావాలని కలెక్టర్ కోరారు. వార్డుల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని నిర్ణయించే ఈ ప్రక్రియ ముగిస్తే, ఎన్నికల సమరానికి లైన్ క్లియర్ అయినట్లేనని విశ్లేషకులు భావిస్తున్నారు. రిజర్వేషన్ల లెక్క తేలగానే ప్రధాన పార్టీలు తమ అభ్యర్థుల వేటను ప్రారంభించే అవకాశం ఉంది.

## అపార్ట్‌మెంట్‌లో పేకాట స్థావరంపై దాడి



**నిజామాబాద్ జిల్లా జనవరి 17(డీడీ9 వార్త) :** నిజామాబాద్ నగర శివారులోని రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న పేకాట స్థావరంపై సీసీఎస్ పోలీసులు మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం: నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు సీసీఎస్ ఏసీపీ ఇంచార్జ్ మస్తాన్ అలీ సూచనలతో ఎస్సై గోవింద్ సిబ్బంది శుక్రవారం సాయంత్రం గంగస్థాన్ ఫేస్-1లోని సాయి రుద్వి అపార్ట్‌మెంట్‌పై దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న ఏడుగురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 22,060 నగదుతో పాటు 7 సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను, స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి విచారణ నిమిత్తం నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ కు అప్పగించారు. నగరం శివారు ప్రాంతాల్లో ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## ల్యాబ్ టెక్నీషియన్లకు నియామక పత్రాల పంపిణీ



**నిజామాబాద్ జిల్లా జనవరి 17(డీడీ9 వార్త) :** రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నియమించిన ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 అభ్యర్థులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో నియామక పత్రాలను అందజేశారు. నిజామాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రాజశ్రీ ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగ్ ఉత్తర్వులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశ్రీ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర కీలకమని అన్నారు. రోగ నిర్ధారణ పరీక్షలు ఖచ్చితత్వంతో నిర్వహించి, రోగుల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 18 మంది ల్యాబ్ టెక్నీషియన్లను వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలకు కేటాయించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో సుమంత్ కుమార్, సూపరింటెండెంట్ వినయ్ కుమార్, జస్టిన్, ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ, తమకు కేటాయించిన కేంద్రాలలో తక్షణమే విధుల్లో చేరుతామని తెలిపారు.

## మహారాష్ట్ర స్ఫూర్తితో ఇందూరులోనూ బీజేపీ గెలుపు ఖాయం



**నిజామాబాద్ జిల్లా జనవరి 17(డీడీ9 వార్త) :** మహారాష్ట్ర కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి సాధించిన అద్భుత విజయంపై జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్‌లో శుక్రవారం అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పటాకులు కాల్చి, మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహారాష్ట్రలో జరిగిన 29 కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ కూటమి 26 స్థానాలను కైవసం చేసుకోవడం గర్వకారణమన్నారు. హిందువులంతా ఏకమై అందించిన ఈ విజయం దేశవ్యాప్తంగా మార్పుకు సంకేతమని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో తెలంగాణలోనూ, ముఖ్యంగా నిజామాబాద్‌లో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరును విమర్శిస్తూ..కాంగ్రెస్ అంటే మైనారిటీ.. మైనారిటీ అంటే కాంగ్రెస్ అని ప్రభుత్వం వ్యవహరిస్తోందని, దీనిని ప్రజలు గమనిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి హిందూ దేవాలయాలపై దాడులు పెరిగాయని ఆరోపించారు. నిజామాబాద్ గడ్డపై బీజేపీ గెలవడమే కాకుండా, నగర పేరును ఇందూరుగా మార్చడం కూడా ఖాయమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోళ్ల లక్ష్మీనారాయణ, కార్యదర్శి జ్యోతి, వివిధ మండలాల అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు మరియు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చౌట్ పల్లి మార్కెట్‌లో తీరిన చీకటి కష్టాలు

- విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసిన గ్రామ పాలకమండలి
- సర్పంచ్, సభ్యుల చొరవపై గ్రామస్తుల హర్షం



**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 17(డీడీ9 వార్త) :** కమ్మర్‌పల్లి మండలంలోని చౌట్ పల్లి గ్రామంలో మార్కెట్ నిర్వహణ సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యకు పరిష్కారం లభించింది. మార్కెట్ ప్రాంగణంలో చీకటి కారణంగా ఇన్నాళ్లు కొనుగోలుదారులు, వ్యాపారులు పడుతున్న ఇబ్బందులను గమనించిన గ్రామ సర్పంచ్ మహబూబ్ పాలకమండలి అక్కడ నూతనంగా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి వెలుగులు నింపారు. గతంలో మార్కెట్ సాయంత్రం వేళల్లో జరిగినప్పుడు సరైన వెలుతురు లేక జనాలు వస్తువులు కొనడానికి, వ్యాపారులు అమ్మకాలు జరపడానికి తీవ్ర ఇబ్బందులు పడేవారు. చీకటిని ఆసరాగా చేసుకుని కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు పాలకమండలి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది సమిష్టిగా కృషి చేసి, మార్కెట్ అంతా వెలుతురు ఉండేలా లైట్లను అమర్చారు. ప్రజల అవసరాలను గుర్తించి, సకాలంలో స్పందించి మార్కెట్‌లో వెలుగులు తీసుకొచ్చినందుకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా ఇలాంటి మరిన్ని ప్రజాహిత పనులు చేపడతామని గ్రామ పాలకమండలి ప్రతినిధులు ఈ సందర్భంగా తెలిపారు.

